ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
గురువారం 5 డిసెంబరు 2024



ఆసిఫాబాద్‌లో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు మండలంలో బుధవారం ఓమోస్తరు వర్షంకురిసింది. తుఫాను ప్రభావంతో ఆకాశం మేఘావృతమై వర్షంపడింది. ఐదురోజులుగా తుఫాను ప్రభావంతో జిల్లాలో చలితీవ్రత తగ్గింది. జిల్లాలోని తిర్యాణి మండలంలోని గిన్నెధరిలో 19.3డిగ్రీలఉష్ణోగ్రత నమోదైంది.

బెజ్జూరులో స్వల్ప భూకంపం

బెజ్జూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం 7.20 గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొన్నిచోట్ల ఇంట్లో వస్తువులు కింద పడిపోయాయి.

7న టాక్సీ డ్రైవర్ల రాష్ట్రవ్యాప్త బంద్

ఆసిఫాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికలముందు కాంగ్రెస్ నాయకులు ఆటోటాక్సీ, క్యాబ్‌డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల7న రాష్ట్రబంద్‌ను నిర్వహించతల పెట్టినట్లు నాయకులు ఉపేందర్, అస్లాం ఖాన్, రఫీ, లక్ష్మణ్, బాలాజీ, ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమాన్ని సభ్యులు విజయ వంతం చేయాలని కోరారు.

రేపు బహిరంగ విచారణ

ఆసిఫాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వెనుకబడిన తరగతుల కులములు, కులసంఘాల ప్రతినిధుల నుంచి స్థానికసంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంలో ఈనెల 6న ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపడతామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. విచారణకు హాజరై తమ అభ్యర్థనలు, ఆక్షేపణలు, సలహాలు సమర్పించాలన్నారు.

ట్రా‘ఫికర్’

- అస్తవ్యస్తంగా ట్రాఫిక్
- ఇరుకుగా రోడ్లు.. పెరిగిన వాహనాల రద్దీ
- రోడ్లపైనే తోపుడు బండ్లు, వాహనాల పార్కింగ్


ఆసిఫాబాద్‌లోని అంబేద్కర్ చౌక్‌లో రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ఆసిఫాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చింది. ఎక్కడ చూసినా వాహనాల రద్దీ, ఫుట్‌పాత్‌లపైనే వాహనాలు, తోపుడు బండ్లు ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చాలీచాలని రోడ్లతో ట్రాఫిక్ సమస్యకు దారితీస్తున్నాయి. డివిజన్ కేంద్రంగా ఉన్న సమయంలోనే ప్రజలకు ఇబ్బందిగా మారిన ట్రాఫిక్ సమస్య జిల్లా కేంద్రం అయ్యే సరికి రెట్టింపు అయ్యాయి. జిల్లాకేంద్రం కావడంతో వాహనాల తాకిడి పెరిగింది. జిల్లా కేంద్రంలో అటు జిల్లా స్థాయి అధికారుల వాహనాలు, ఇతర మండలాల నుంచి వచ్చిపోయే వారి వాహనాల తాకిడి పెరగడంతో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. ఆటో స్టాండ్‌లకు అనువైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మొదలే ఇరుకైన రోడ్లు, వాటిపై నిర్వహిస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చివరకు పాదాచారులు సైతం అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి ఉంది. ప్రజలు జిల్లా కేంద్రంలోని రోడ్లపై తిరగాలన్నా అటుగుండా ప్రయాణించాలన్నా వెళ్లలేని పరిస్థితి. జిల్లాకేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపార, వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు ఉండడంతో పార్కింగ్ కోసం స్థలం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. నిత్యం ఈ రహదారి వెంట వేలసంఖ్యలో వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయి. రద్దీగా ఉండే ఈ రోడ్డుకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్‌దుస్థితిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధానకూడళ్ల వద్ద ట్రాఫిక్ కష్టాలు..

జిల్లాకేంద్రంలో ప్రధానకూడళ్ల అయిన అంబేద్కర్‌చౌక్, వివేకానందచౌక్, గాంధీచౌక్‌లలో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రధానకూడళ్లలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండడం, వీటి సమీపంలోనే ఆర్టీసీ బస్టాండు, డిపో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. గాంధీ చౌక్, వివేకానందచౌక్‌లలో తోపుడుబండ్లు, చిరువ్యాపారులు రోడ్లపైనే తమ వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లు విస్తారంగా లేకపోవడం ఇరువైపులా వ్యాపారసముదాయాలు ఉండడంతో వినియోగదారులు వస్తువుల క్రయవిక్రయాల కోసం వచ్చినప్పుడల్లా ద్విచక్రవాహనాలను, నాలుగు చక్రాలవాహనాలను రోడ్డుపైనే ఉంచి తమ పనులను కొనసాగించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వాహనాలను రోడ్లపైనే పార్కు చేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చింది. అలాగే జిల్లాకేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలసంఖ్యలో విద్యార్థులు ఆయాపాఠశాలలకు వచ్చి ఈ చౌరస్తాలపైనే వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడం, వాహనాల రద్దీ ఏర్పడడంతో ప్రాథమికస్థాయి విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లల విషయంలో ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పార్కింగ్ స్థలాలు, రోడ్లు విస్తరిస్తే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఒక కొలిక్కి వచ్చే అవకాశాలుంటాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఆదిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలి..

\- ప్రణయ్, ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు ఎక్కువ అవుతోంది. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్లపై వాహనాలను నడపాలంటే తీవ్ర ఇబ్బందులవుతున్నాయి. ప్రధానకూడళ్లలో రోడ్లపైనే తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో పార్కింగ్‌తోపాటు ట్రాఫిక్‌సమస్య తలెత్తుతోంది. అధికారులు దృష్టిసారించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్


కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

సిర్పూర్(టి), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారుల ను అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని దుబ్బగూడలో ఏర్పాటుచేసిన సెర్ప్‌ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సన్నరకానికి ప్రభుత్వం అదనంగా రూ.500బోనస్ ఇస్తుందన్నారు. అనంతరం స్టాక్‌రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్, కవర్లు అందు బాటులో ఉంచాలన్నారు. ఆయనవెంట డీఎస్‌వో దత్తారాం, డీఆర్డీఏ అదనపు పీడీ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం దుర్గయ్య, సీసీ రాజేష్ తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

ఆసిఫాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం, ఉద్యోగభద్రత, ఈఎస్ఐ, పీఎఫ్‌సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ సర్వే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజేందర్, కృష్ణమాచారి, పద్మ, భాగ్య, పంచశీల తదితరులు పాల్గొన్నారు.

కవి మాడిశెట్టి శ్రీనివాస్‌ను సన్మానించిన కలెక్టర్


కవి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీడిపో ఆఫీసు సూపరింటెండెంట్, కవి మాడిశెట్టి శ్రీనివాస్ రచించిన ‘నువ్వు నేను గోదారి’ పుస్తకాన్ని డీఎం విశ్వనాథ్‌తో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కవి శ్రీనివాస్‌ను శాలువాతోసత్కరించి అభినందించారు.

తెలంగాణ అగ్రిడాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం


ఎన్నికైన అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అగ్రిడాక్టర్స్ అసోసియేషన్ జిల్లాకార్యవర్గంను బుధవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్‌చైర్మన్‌గా జిల్లావ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లాఅధ్యక్షుడిగా మిలింద్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా యుగంధర్, సంయుక్తకార్యదర్శిగానాగరాజు, కోశాధికారిగా మంజుల, ఉపాధ్యక్షు రాలుగా ప్రేమలత, సభ్యులుగా గోపీకాంత్, గిరీష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్‌కమిటీ అధ్యక్షుడి సాల్మన్‌నాయక్, ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతలో అడవులు కీలకం


పెంచికలపేటలో ఎఫ్‌బీ ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్, ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికలపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమ తుల్యతలో అడవులు కీలకమని ఎమ్మెల్సీ దండెవిఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.29 లక్షల ‘కంపా’ నిధులతో నూతనంగా నిర్మించిన బొంబాయిగూడ ఫారెస్టుబీట్ ఆఫీసర్ భవనాన్ని జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్, నాయకులు గణపతి, హర్షద్‌హుస్సేన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని వీరవెల్లిలో, శిర్షగ్రామభవన నిర్మాణానికి ఎమ్మెల్సీ దండె విఠల్ బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, విశ్వనాథ్, జగ్గాగౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే నమోదు త్వరగా పూర్తి చేయాలి

వాంకిడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాల యంలో కొనసాగుతున్న కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును త్వరగా చేపట్టాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. బుధవారం ఆన్‌లైన్ డాటా ఎంట్రీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి పూట సర్వర్ ఫ్రీగా ఉంటుందని వీలైతే రాత్రివేళల్లో కూడా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీవో జావీద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చింతలమానేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దరంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు తండ్రి శంకర్ నాలుగురోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా ఎస్ఆర్ఎస్ యూత్‌సభ్యులు పరామర్శించి దినఖర్మ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్ సభ్యులు శ్రీనివాస్, వెంకటేష్, నగేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MEERA GAIN W/O. MANDAL CHIRANJIT, RESIDENT OF ADDRESS NAZRULNAGAR, VILLAGE NO-12, MANDAL KAGHAZNAGAR DIST: KUMARAM BHEEM ASIFABAD, HAVE CHANGED MY NAME FROM MEERA GAIN (EXISTING NAME OF SPOUSE AS PER CHANGE OF NEXT OF KIN RECORD / SERVICE DOCUMENTS) TO MEERA MANDAL PROPOSED/ ADOPTED. (NEW NAME) VIDE AFFIDAVIT DATED 21.11.2024. BEFORE JUNIOR CIVIL COURT GODHAVARIKHANI.

ప్రాణహిత ప్రాజెక్టుకు 60శాతం నిధులు తీసుకొస్తా

- ఆ బాధ్యత నాదే
- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు


చింతలమానేపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ విఠల్

చింతలమానేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించి రైతులకు సాగునీరు అందించేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటే కేంద్రప్రభుత్వం నుంచి 60శాతం నిధులు తీసుకొచ్చే బాధ్యత నాదేనని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం చింతలమానేపల్లి మండలం బాలాజీ అనుకోడ రైతువేదికలో 78మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆర్థికంగా వెనకబడి ఉందని ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులు చేయడం లేదని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కేవలం సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబా రక్ చెక్కులు పంపిణీ మాత్రమే చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజాసంక్షేమంకోసం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునావర్ షరీఫ్, మల్లయ్య, శ్రీశైలం, నానయ్య, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టును వార్ధా నది వద్ద నిర్మిస్తాం: ఎమ్మెల్సీ

బెజ్జూరు: ప్రాణహిత-చేవెళ్ల అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును వార్ధానది వద్ద నిర్మిస్తామని ఎమ్మెల్సీ దండెవిఠల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే హరీష్‌బాబుతో కలిసి పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రత్యేకప్యాకేజీ కోసం ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రఆర్థిక పరిస్థితులు బాగాలేక నిధులకు ఇబ్బంది అవుతుందన్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, కేంద్రప్రభుత్వం 60శాతం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీశంకర్, నాయకులు ఓంప్రకాష్, నానయ్య, హర్షద్ హుస్సేన్, జగ్గాగౌడ్, నాహీర్ అలీ, రాజన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన భోజన వసతి కల్పించాలి

బెజ్జూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తనిఖీచేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని రుచిచూసి పలుసూచనలు చేశారు. మెరుగైన భోజనవసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ చదువు చక్కటి భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుందని, చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో వివిధకారణాలతో ఇద్దరు మృతిచెందగా, బుధవారం వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలపై అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం రెబ్బెనలోని జడ్పీ ఉన్నతపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వంటగది, నిత్యావసర సరుకులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు తాజాభోజనం, మెనూప్రకారం అందించాలన్నారు. ఆహారం తయారీలో నాణ్యమైన భోజనం కల్పించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని తప్పులు లేకుండా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యాన్ని తీసుకరావాలి

రైతులు కొనుగోలు కేంద్రాలకు సన్నరకం ధాన్యాన్ని తీసుకవచ్చి మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవారం రెబ్బెన మండలం నారాయణపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి మద్దతుధరతోపాటుక్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. తహసీల్దార్ రాంమోహన్ పాల్గొన్నారు.

డాటా ఎంట్రీని వేగవంతం చేయాలి

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా


బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ కులగణన సర్వే వివరాల డేటా ఆన్‌లైన్‌ఎంట్రీని ఆపరేటర్లు త్వరగా పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. బుధవారం డాటా ఎంట్రీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేవివరాలను తప్పులు లేకుండా నమోదుచేయాలన్నారు. అనంతరం మండలలెవల్‌స్టాకిస్ట్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమెవెంట మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి..

బెజ్జూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. బుధవారం ఆమె మండలకేంద్రంలోని ఆశ్రమబాలికల గిరిజన, కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అదించాలన్నారు. కేజీబీవీలో నాణ్యమైన కూరగాయలు లేకపోవడంతో కూరగాయలు సరఫరా చేసే వారికి షోకాజు నోటీసులు జారీచేయాలని తహసీల్దార్ భూమేశ్వర్‌ను ఆదేశించారు.

కేజీబీవీలో, ఆశ్రమపాఠశాలలో మెనూ తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీని పరిశీలించారు. త్వరగా డాటా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. ఆమెవెంట తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీశంకర్, ఆర్ఐ సంతోష్, ఎస్‌వో అరుణ, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష


ఆసిఫాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపరీక్ష(న్యాస్) ప్రశాంతంగా జరిగిందని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, సెయింట్‌మేరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షా విధానాన్ని పరిశీలించారు.

లింగాపూర్: మండలంలోని ఎంపీయూపీఎస్ ఎల్లాపటార్, టీడబ్ల్యూ పీఎస్ పిక్లాతండా, టీడబ్ల్యూ పీఎస్ పూల్‌సింగ్ తండా పాఠశాలలో బుధవారం 3వతరగతి విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకేంద్రా లను మండల విద్యాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు.

వాంకిడి: మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కేజీబీవీ, ప్రాథమికపాఠశాలలో బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షా కేంద్రాలను ఎంఈవో శివకుమార్, సిబ్బంది పరిశీలించారు.

జైనూర్: విద్యార్థులలో విద్యాసామర్థ్యం పెంపు కోసమే న్యాస్‌పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని నాలుగు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బుధవారం న్యాస్‌పరీక్షలు నిర్వహించామని, పరీక్షలు రాసే తీరును పరిశీలించామన్నారు.

రెబ్బెన: రెబ్బెనలో పరీక్షకేంద్రాన్ని జిల్లా విద్యాధికారి యాదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వసతులపై వాకబు చేశారు. హెచ్‌ఎం రవిప్రసాద్, లతీఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు.

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆశ్రమ స్పోర్ట్‌పాఠశాలలో 71వసీనియర్ కబడ్డీజట్టు ఎంపిక చేపట్టారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, స్పోర్ట్స్ అధికారి జంగు, హెచ్‌డబ్ల్యూవో సాయిబాబా, సీఆర్టీ రవీందర్, ధర్మారావు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల7నుంచి 10వరకు హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయిపోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,కోచ్‌లు లింగారావు, రాకేష్, లక్ష్మి, జయ, అరవింద్, చంద్రశేఖర్, సోమేష్, సెద్మారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● రాష్ట్ర గిరిజన సహకార సంఘం చైర్మన్ కె తిరుపతి



ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొన్న నాయకులు

రెబ్బెన, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సహకార సంఘం చైర్మన్ కె తిరుపతి అన్నారు. బుధవారం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరం కాలంలో కాంగ్రెస్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎల్లయ్య నాయక్ మాట్లాడుతూ సీఎం అన్నివర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నాడని అన్నారు. రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కేవలం సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ శ్యాంనాయక్, అనీల్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, పార్టీమండల అధ్యక్షుడు రమేష్, మాజీ జడ్పీటీసీ ప్రకాష్‌రావు, ఆత్మరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జైనూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం విద్యార్థులకు జైనూర్ పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ రోజురోజుకు సైబర్‌నేరాలు అధికమవుతున్నాయని అన్నారు. ఎవరైనా బ్యాంక్ ఖాతానంబర్, ఆధార్‌నంబరు అడిగితే ఎట్టి పరిస్థితిలో ఇవ్వకూడదని అన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసినప్పుడు వెంటనే పోలీసులకు అందజేయాలని కోరారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930నంబర్‌కి ఫోన్‌చేయాలని సూచించారు. ఎస్‌ఐ సాగర్, ప్రిన్సిపాల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సైబర్ నేరాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని పట్టణసీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. అపరిచతవ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పరాదన్నారు. కొత్తగా వచ్చిన మెసెజ్‌లు, సాఫ్ట్‌వేర్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోరాదన్నారు. ఏటీఎం వివరాలు కూడా ఎవరికీ చెప్పరాదన్నారు.

కాగజ్‌నగర్‌లో చోరీ

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండస్ట్రీయల్ ఏరియాలో నివాసం ఉంటున్న నాగేశ్వర్‌రావు ఇంట్లో మంగళవారం రాత్రి చోరి జరిగినట్టు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొన్నిరోజుల క్రితం నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌కు వెళ్లాడు. బుధవారం ఉదయం పక్కింటివారు నాగేశ్వర్‌రావు ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే హైదరాబాద్‌లో ఉన్న అతడి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పూర్తి వివరాలు సేకరించి బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు సీఐ వివరించారు. ఈచోరీలో12తులాల బంగారం పోయినట్టు తెలిపారు.

స్క్రాప్ దొంగల పట్టివేత

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని మూతబడిన సర్‌సిల్క్ మిల్లులో ఇనుపవస్తువులు చోరీ చేసిన కేసులో ఇద్దరిని పట్టుకున్నట్టు టౌన్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలం కోయవాగుకు చెందిన చెన్నమనేని శ్రీనివాస్‌రావు, షేక్ అంజాద్ నుంచి మిల్లుకు సంబంధించిన స్క్రాప్ రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన విచారణ జరుపుతున్నట్టు ఆయన తెలిపారు.

రావులపల్లిలో కార్డన్ సెర్చ్

దహెగాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల అటవీప్రాంత గ్రామమైన రావులపల్లిలో బుధవారం ఎస్సైరాజు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ అపరిచిత, కొత్తవ్యక్తులు ఎవరైనా వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి అవగాహన

సిర్పూర్(టి), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడి కోర్టుకేసులో ఉన్న పలువురికి ఎస్సై కమలాకర్ బుధవారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ఈనెల14న లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

బెజ్జూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

అన్నదాతకు వరికోత కష్టాలు

● హార్వెస్టర్ల కొరత ● పక్క జిల్లాల నుంచి యంత్రాల బుకింగ్ ● ఓ వైపు వర్షాల భయం.. రైతుల్లో ఆందోళన



రెబ్బెన, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరికోత యంత్రాల కొరత రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లా లో సాగవుతున్న విస్తీర్ణానికి సరిపడా వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సాగు సమయంలో పడిన కష్టం కంటే కోత కోసేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. హార్వెస్టర్లు అందుబాటులో లేకపోవటంతో పక్కజిల్లాల నుంచి తెప్పిస్తున్నారు. అయినా కూడా కొందరికి అందడం లేదు. దీంతో వరి పండించిన రైతులు టెన్షన్‌కు గురవుతున్నారు. జిల్లాలో 55వేల ఎకరాల వరకు వరిసాగు ఉండగా, గతానికి భిన్నంగా ఈ సారి జిల్లా అంతటా కోతలు ఒకేసారి ప్రారంభం అయ్యాయి. దీంతో హార్వెస్టర్ యంత్రాల కొరత ఏర్పడింది. హార్వెస్టర్లు ముందుగా అటువైపు కోతలు పూర్తి చేసుకొని ఆ తర్వాత రెబ్బెన, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాలకు చేరుకుంటాయి. గతానికి భిన్నంగా జిల్లా అంతటా ఒకేసారి కోతలు మొదలయ్యాయి. వరికోతలు ప్రారంభమై దాదాపు 20 రోజులు గడుస్తున్నప్పటికీ కనీసం 40శాతం కూడా పూర్తి కాలేదు. కోతలు ఆలస్యమవుతుండటంతో భూ ముల్లో తడి ఆరిపోయి వరి నేలకొరుగుతోంది. ధాన్యం నేలరాలి దిగుబడి తగ్గుతోంది. చేతికందే పంట నేల పాలు అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.



వరి కోస్తున్న హార్వెస్టర్

పెరిగిన రేట్లు..

గతేడాది టూవీలర్ హార్వెస్టర్‌కు గంటకు రూ.2వేల వరకు కిరాయి తీసుకోగా, ఫోర్‌వీల్ హార్వెస్టర్‌కు గంటకు రూ.2800, ట్రాక్ హార్వెస్టర్‌కు రూ.3వేల వరకు తీసుకున్నారు. ఈ సారి టూవీల్ హార్వెస్టర్‌కు రూ.2200నుంచి రూ.2300వరకు వసూలు చేస్తున్నారు. ఫోర్‌వీలర్‌కు రూ.3వేలు, ట్రాక్ హార్వెస్టర్‌కు రూ.3500వరకు వసూలు చేస్తున్నారు. అత్యవసరమైన సమయంలో అధిక కిరాయి చెల్లించేందుకు కూడా వెనుకాడటం లేదు. దీంతో అన్నదాతలపై అదనపు భారం పడుతోంది. కాగా ఒకవైపు వర్షాలు కురుస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు టెన్షన్ పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లాయంత్రాంగం వెంటనే స్పందించి హార్వెస్టర్ యంత్రాలు అందుబాటులో ఉండేట్టు చూడాలని రైతులు డిమాండు చేస్తున్నారు.

ఘనంగా వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం



కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు



తిర్యాణిలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

కాగజ్‌నగర్/రెబ్బెన, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్,రెబ్బెన మండలకేంద్రాల్లో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ అటవీ సంపదను, వన్యప్రాణులను రక్షించాలన్నారు. కార్యక్రమాల్లో కాగజ్‌నగర్ డిప్యూటీ రేంజర్ శశిధర్‌బాబు, రెబ్బెన ఎఫ్‌ఆర్వో నిజాముద్దీన్, బానేష్,ఎఫ్‌ఎస్‌వో బాబు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

బెజ్జూరు: వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బెజ్జూరు అటవీరేంజ్ అధికారి ముసావీర్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణదినోత్సవం సందర్భంగా బుధవారం మండలకేంద్రంలో విద్యార్థులతో కలిసిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అటవీఅధికారులు శ్రావణ్, మల్లికార్జున్, మురళీ, వెంకటేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంలో బుధవారం రేంజ్ అధికారి ఎక్బాల్‌హుస్సేన్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

తిర్యాణి: మండలకేంద్రంలో అటవీ అధికారులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రేంజ్‌అధికారి సరోజరాణి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌ఎక్బాల్, సెక్షన్ ఆఫీసర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలకేంద్రంలో అటవీ అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి మజారోద్దీన్, తదితరులు పాల్గొ న్నారు.



బెజ్జూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు, విద్యార్థులు



రెబ్బెనలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రారంభమైన శివమల్లన్న బోనాల పండుగ

● మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తులు ● నెలరోజులు సందడిగా ఈసుగాం ఆలయం



బోనం వండుతున్న భక్తులు

కాగజ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ దేవాలయమైన ఈసుగాం శివమల్లన్న ఆలయంలో బోనాల పండుగ బుధవారం నుంచి ప్రారంభమైంది. వానాకాలం చేతికొచ్చిన కొత్త బియ్యంతో దేవుడికి నైవేద్యం సమర్పించి భవిష్యత్తులో కూడా పాడిపంటలతో విలసిల్లాలని అంతా కోరుకుంటూ ఈ బోనాలు చేయటం ప్రత్యేకత. మేళతాళాలతో సంప్రదాయ గీతాలు, కోలాటం, డోలు చుప్పళ్లతో గ్రామస్థులు బోనాల పండుగను కన్నుల పండువగా నిర్వహిస్తారు. దేవుడికి నైవేద్యం సమర్పించేంత వరకు కుటుంబ సభ్యులంతా కూడా ఉపవాస దీక్ష తీసుకుంటారు. క్షీరాన్నం, చిక్కుడు, అనపకాయ, వంకాయ తదితర కూరగాయాలు బోనం వండి దేవుడికి నైవేద్యం సమర్పిస్తారు. ఒగ్గు కళాకళాకారులు భక్తి పాటలు పాడుతూ శివుడికి హారతులిస్తారు.

భక్తుల కోసం ఏర్పాటు..

బోనాల పండుగ ఉన్నందున ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్, వంట సామాగ్రి, నీటివసతి కల్పించారు.

నెల రోజులపాటు జరుగుతాయి..

-సంతోష్ శర్మ, ఆలయ పూజారి



మార్గశిర మాసంలో కొత్త బియ్యం వస్తాయి కాబట్టి ఈ బియ్యంతో అన్నం వండి దేవుడికి నైవేద్యం సమర్పిస్తారు. ప్రతి బుధవారం, ఆదివారంబోనాల కార్యక్రమం నిర్వహిస్తాం.

ఉన్ని దుస్తులకు డిమాండ్

● రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రత



స్వెటర్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వాంకిడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. చలినుంచి కాపాడుకునేందుకు ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. రాత్రి సమయంలో చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీంతో ప్రజలు ఉన్నిదుస్తులు కొనుగోళ్లు చేస్తు న్నారు. చలిని దృష్టిలో ఉంచుకుని వ్యాపారస్తులు స్వెట్టర్లు, దుప్పట్లు, పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. పంజాబ్‌నుంచి వీటిని కొనుగోలుచేసి రోడ్లకు ఇరువైపులా పెట్టి విక్రయిస్తున్నారు. కొందరు బైక్‌లపై ఇళ్లవద్దకే వచ్చి విక్రయిస్తున్నారు. తక్కువ ధరలకు స్వెట్టర్లు, దుప్పట్లు అందుబాటులో వస్తుండడంతో ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు అసక్తి చూపుతున్నారు.

పనులను నాణ్యతతో చేపట్టాలి

కెరమెరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్-ఆదిలాబాద్ రోడ్డుపనుల మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలని మానవ హక్కుల వేదిక నాయకులు సుజాయత్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన రోడ్డుపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుమరమ్మతు పనులను సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకంగా చేపడుతున్నారన్నారు. ఈవిషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

వాంకిడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శివచరణ్‌కుమార్, హెచ్‌ఎం నటరాజ్, వినేష్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రి తనిఖీ

కౌటాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్యశాలను బుధవారం జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న 21 అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని గడువులోగా పూర్తిచేయాలని అన్నారు.

పూజల్లోపాల్గొన్న బీజేపీజిల్లా అధ్యక్షుడు

కాగజ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం దుర్గానగర్ విలేజీ నెం10లో నిర్వహించిన భగవత్ పూజలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తి కార్యక్రమాలతో ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. అనంతరం కమిటీసభ్యులు ఆయనను ఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

శ్రీరాంపూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఉద్యోగాలు పొందిన 110 మంది అభ్యర్థులు బుధవారం పెద్దపల్లిలో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. ఇందులో ఎక్స్‌టర్నల్ అభ్యర్థులు 36మంది కాగా, కారుణ్యనియామకాల అభ్యర్థులు 74మంది ఉన్నారు. వీరంతా ఏరియా అధికారుల ఆధ్వర్యంలో బస్సులలో పెద్దపల్లికి తరలివెళ్లారు. ముందుగా అభ్యర్థులకు అధికారులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీ పాలనలోనే పరిశ్రమల ప్రగతి



కార్మికులతో మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

మందమర్రిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశంలోని పరిశ్రమలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని బీజేపీజిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బుధవారం ఏరియాలోని కేకే5 గని వద్ద కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 9న ఓటరు నమోదుకు ఆఖరు తేదీ అని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందుగుల శ్రీనివాస్, డీవీ దీక్షితులు, చప్పిడి నరేష్, సంజీవరావు, రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలోనే సింగరేణి అభివృద్ధి

మందమర్రిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ ప్రజాప్రభుత్వంలోనే సింగరేణి ఎనలేని ప్రగతిని సాధించిందని, కార్మికులకు మెరుగైన లాభాల వాటా ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్ తెలిపారు. బుధవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మెరుగైన లాభాల వాటా చెల్లించామన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పోరాడేది ఐఎన్‌టీయూసీయేనని తెలిపారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలి



ఐకే ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి

జైపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అధికారులు, కార్మికులు రక్షణతో కూడిన బొగ్గుఉత్పత్తి చేయాలని డైరెక్టర్ ప్రాజెక్టుఅండ్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఓసీపీగని పని స్థలాలను జీఎం సూర్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2024-25ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేలా అధికారులు, కార్మికులు కృషి చేయాలన్నారు. ఓసీపీలోని క్వారీలోకివెళ్లి కోల్‌బెంచ్ అప్లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఉత్పత్తి పెంపు కోసం అధికారులకు సూచనలు చేశారు. వరాహ ఓబీ కాంట్రాక్టు కంపెనీకి నిర్దేశించిన రోజువారి లక్ష్యం సాధించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గుఉత్పత్తి ఉత్పాదకత సాధించడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఓసీపీ అధికారి ఏవీరెడ్డి, మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణారావు, సేఫ్టీ అధికారి సతీష్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి, హిందూస్వాముల అరెస్టుకునిరసనగా బుధవారం జిల్లాకేంద్రంలోని వివేకానందచౌక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ హిందువులపై దాడిచేస్తున్న వారినిగుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవరావు,కోటేశ్వర్,విశాల్,కరణ్,నాగరాజు,గణేష్‌పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందు మత సంస్థలపై అఘాయిత్యాలకు ఒడికట్టడం దారుణమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగటం దారుణమైన విషయమన్నారు. హిందువులకు సంఘీభావంగా ఈ ర్యాలీ చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ, నాయకులు కాళిదాస్ మజుందర్, అరుణ్ లోయా, వీరభద్రచారి, దెబ్బటిశ్రీనివాస్, ఆయాసంఘాల నాయకులుపాల్గొన్నారు.



కాగజ్‌నగర్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

జీవో 317 బాధితులకు
న్యాయం ఎప్పుడు..?

5వ పేజీ తరువాయి

ఉద్యోగులు తాము కోరుకున్న జిల్లాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు. 317 జీవో వల్ల సుమారు 80 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను జూనియర్ అనే కారణంతో ఇత ర జిల్లాలకు స్థానికేతర్లుగా కేటాయించారు. అలాంటి వారికి ఇప్పుడు అవకాశం లేకుండా పోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుకున్న జిల్లాల్లో అవకాశం ఇచ్చేలాగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. లేనిపక్షంలో శాశ్వతంగా తమ సొంత జిల్లాలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటాయి.

జీవోను రద్దు చేయాలి..

బండి రమేశ్, తపస్ అదనపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం 317 జీవో రద్దుచేసి స్థానికేతర్లుగా వెళ్లిన ఉపాధ్యాయులం దరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై ఆది నుంచి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు, ర్యాలీలు చేపట్టాం. క్యాబినెట్ సబ్ కమిటీ కూడా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వకపోవడం అన్యాయం. స్పౌజ్, మెడికల్, మ్యూచువల్ బదిలీలకు అవకాశం సంతోష దాయకమే. కానీ స్థానికేతర్లుగా వెళ్లిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలి.

వ్యవసాయాధికారుల జిల్లా కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

గర్మిళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా వ్యవసాయాధికారుల నూతన కార్యవర్గాన్ని బుధవారం మంచిర్యాలలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సుద్దాల ప్రేమ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా బానోత్ ప్రసాద్, కోశాధికారిగా కిరణ్మయి, సెంట్రల్ ఈసీ మెంబర్‌గా మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ నాయక్, జనరల్ సెక్రటరీ తిరుపతినాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసెస్ కమీషన్ పరిధిలో ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించే గ్రూప్- 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కర్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రూప్ 2 పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్ష నిర్వహణకు ఫ్లయింగ్‌స్క్వాడ్, సూపర్‌వైజర్లు, ఇన్విజిలేట ర్లను నియమించామని తెలిపారు. అధికారులు, సిబ్బంది నిబధనలు పాటించాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేల తల్లిని కాపాడుకుందాం

మనిషి ఉనికికి, జీవనానికి మట్టి మూలాధారం. ఆరోగ్యవంతమైన నేల ఉన్నప్పుడే ప్రపంచ వ్యాప్తంగా జనాభాను పోషించుకోవడానికి కావల్సిన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుంది. ప్రస్తుతం నానాటికి నేల పైపార దెబ్బతింటోంది. ఇది ఆహార భద్రత పై ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

- భూసార పరీక్షలతో భూమికి రక్ష
- రైతులకు పంట దిగుబడులు
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం
- నేడు ప్రపంచ నేల దినోత్సవం





భూసార పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

బెల్లంపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడలో నేల పాత్ర అత్యంత కీలకం. రసాయన ఎరువులను ఉపయోగించి రైతులు వ్యవసాయం చేయడం వల్ల నేల సారం దెబ్బతింటుంది. రైతులు భూసార పరీక్షలు నిర్వహిస్తే ఆ నేలలో ఏ రకమైన పోషకాలు ఉన్నాయి, ఆ నేలల్లో ఏ పంటలు వేసుకోవాలి, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి అనే విషయాలు తెలుసుకునేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయి. భూసార పరీక్షలపై రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తే నేలను రక్షించడంతో పాటు రైతులు సైతం రసాయన ఎరువులు తగ్గించి లాభాల బాట పట్టవచ్చు. గురువారం ప్రపంచ నేలదినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం...

ఫలితాల ఆధారంగా..

రైతుకు సంబంధించిన పొలంలో భూసార పరీక్షల అనంతరం వచ్చే ఫలితాల ఆధారంగా పొలంలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఎలాంటి ఎరువులు వేసుకోవాలనే పూర్తి వివరాలు భూసార పరీక్షలో తెలుస్తుంది. రైతులు భూసార పరీక్ష ద్వారా తమ పంట పొలాల్లోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. ఇందుకు రైతు తన పొలంలోని ఎకరం భూమిలో 8 నుంచి 10 చోట్ల వి (ఆంగ్ల అక్షరం) 6 నుంచి 8 అంగులాల లోతు వరకు మట్టిని తీయాలి. సేకరించిన మట్టిని బాగా కలిపి శుభ్రమైన గోనె సంచిలోకి తీసుకోవాలి. ఆ మట్టిని నీడలో ఆరబెట్టాలి. మట్టిని ఎండ తగలకుండా ఎలాంటి రసాయనాలు వాడని కవర్లలో తీసుకురావాలి. ఇలా తీసుకున్న మట్టిని ప్లాస్టిక్ సంచీలో వేసి రైతు పూర్తి వివరాలను వాటిలో పొందుపర్చాలి. పొందుపర్చిన మట్టి కవర్‌ను కృషి విజ్ఞాన కేంద్రంలో భూసార పరీక్షల కేంద్రంలో ఇవ్వాలి. అందులోని సిబ్బంది భూసార పరీక్షలు నిర్వహించి మట్టి పరీక్షల ఫలితాలు రైతుకు అందిస్తారు. ఈ పరీక్షల్లో మట్టిలో ఉండే సూక్ష్మపోషకాలు, పీహెచ్(నైట్రోజన్) , సేంద్రియ కర్బనాలు ఏ స్థాయిలో ఉన్నాయని తెలుస్తాయి. వీటితో పాటు ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయి తెలుస్తాయి. లవణాలు, బాస్వర, పొటాష్‌లు ఏ మోతాదులో ఉన్నాయో భూసార పరీక్షల్లో తెలుస్తాయి. దీంతో ఆభూమిలో ఏ పంటలు వేసుకుంటే అధిక దిగుబడి వస్తుంది, ఏ మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు పూర్తిగా తెలిసే అవకాశం ఉంటుంది. రైతులు మట్టిని ల్యాబ్‌లో అందజేసిన రెండు రోజుల్లో సంబంధిత అధికారులు రైతులకు ఫలితాలు అందజేస్తారు. భూసార పరీక్షల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

- పంట దిగుబడి పెరిగేలా..

రైతులు పంట అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశ్యంతో రైతులు రసాయన ఎరువులను పొలాల్లో విపరీతంగా ఉపయోగిస్తున్నారు. దీంతో భూమిసారం కోల్పోతుంది. సరైన పోషక విలువలు లేకపోవడం వల్ల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రైతులు సేంద్రీయ ఎరువులపై దృష్టి సారించి రసాయన ఎరువులను తగ్గిస్తే భూసారాన్ని పెంచడంతో పాటు పంటల్లో సైతం అధిక దిగుబడులు సాధిం చవచ్చు. అలాగే ప్రకృతి వ్యవసాయం , పచ్చిరొట్టె ఎరువులు, జీవన ఎరువులు వాడడం ద్వారా నేల సారవంతంగా ఉంటుంది. రసాయన ఎరువులు వాడడం వల్ల కలిగే అనర్థాలను సంబంధిత వ్యవసాయాధికారులు రైతులకు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తే నేల తల్లిని రక్షించినవారవుతారు.



భూసార పరీక్ష నిర్వహించే పరికరాలు

భూసార పరీక్షలు నిర్వహించుకోవాలి



రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. దీని ఫలితాల ద్వారా ఏ భూమిలో ఎంత మోతాదులో ఏ రకమైన ఎరువులు వాడాలి, భూమి ఏ పంటలకు అనుకూలం అనే విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. రైతులు తమ భూమిలో మట్టి నమూనాలు సేకరించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి అనుమానాలు ఉన్నా అధికారులను సంప్రదించాలి.

ఎం జ్యోతి, భూసార పరీక్ష కేంద్రం ల్యాబ్ టెక్నిషియన్, కేవీకే

రసాయన ఎరువులను తగ్గించాలి



రైతులు పంటల సాగులో అధిక దిగుబడులను సాధించాలనే తపనతో మోతాదుకు మించిన రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసే విధి విధానాలపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. కొంత మంది రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించి నేలను కాపాడడంతో పాటు అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

డాక్టర్ కోట శివకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్

ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలి

నెన్నెల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులను డీలర్లు రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన అన్నారు. మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను అమ్మి.. రైతులకు విధిగా పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని సూచించారు. గడువు ముగి సిన ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దన్నారు. గరిష్ట చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయించకూడదని సూచించారు. దుకాణం ఎదుట స్టాక్, ధరలు, విత్తనాల వివరాలను తెలిపే బోర్డులను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. అమ్మకాలు, రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. అనంతరం వరి కోతల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి రైతులకు వివరించారు. నాన్యతా ప్రమాణాలు పాటిస్తేనే ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. పొలం మొత్తం ఎండిన తర్వాతనే కోయాలన్నారు. తేమ శాతం 17కు తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. కళ్లంలోనే ఆరబెట్టి, తాలు, తప్ప లేని ధాన్యాన్ని సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు. కోతల అనంతరం వరికొయ్యలను కాల్చవద్దని, కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి సృజన, ఏఈవోలు రామ్‌చందర్, సుప్రజా ఉన్నారు.



స్టాక్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఏవో కల్పన

ప్రపంచ నేల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో గురువారం నిర్వహించే ప్రపంచ నేల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఈవో ముత్యం తిరుపతి అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో దినోత్సవాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. భూసార పరీక్షలు, నేలలో భూసారం పెరుగుదలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు.

జిల్లాలో స్వల్ప భూకంపం

- భయాందోళనకు గురైన ప్రజలు

మంచిర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం స్వల్ప భూకంపం సంభవించింది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఉదయం 7.27 గంటలకు ఒక్కసారిగా ప్రకంపనలు రాగా మూడు నాలుగు సెకన్లపాటు భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని వస్తువులు కదలడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

'యువ వికాసం'తో ఉపాధి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం యువ వికాసం పథకం ద్వారా ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నదని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు.బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభకు జిల్లా అధికారులు కిషన్, దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావు, గణపతి, పురుషోత్తం నాయక్, రాజేశ్వర్, వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లాలో గ్రూప్ 4లో అర్హత పొందిన అభ్యర్థులతో కలెక్టరేట్ సముదాయం నుంచి బస్సుల్లో తీసుకువెళ్లారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 4 ద్వారా జిల్లాలో 316 మంది అభ్యర్థులు అర్హత సాధించారని తెలిపారు. అర్హత పొందిన వారికి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించారన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

కోటపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని అటవీశాఖ రేంజ్ అధికారి సదానందం అన్నారు. మండలంలోని ఎసన్‌వాయి గ్రామంలో బుధ వారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై , అడవిలో నిప్పు పర్యావరణానికి ముప్పు అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రేంజ్ అధికారి సదానందం అటవీ, వన్య ప్రాణుల సంరక్షణ గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటిరేంజర్ లావణ్యబీట్ ఆఫీసర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

భీమారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతనపల్లి గ్రామంలో బుధవారం రైతులకు మండల వ్యవసాయాధికారులు సుధాకర్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. వరికోతలు తర్వాత కొయ్యలను కాల్చవద్దని, కొయ్యలను మట్టితో కలిసి దున్నితే భూసారం పెరుగుతుందన్నారు. వరి కోత అనంతరం పొలంలో నీరు పెట్టి 50 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పట్, 15 కేజీల యూరియా చల్లుకుని భూమిలో కలియ దున్నితో భూమి సారం పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ఎప్పుడు..?



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు (ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు తమను క్రమబద్ధీకరించాలని సమ్మె చేపట్టినా సర్కార్ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- దశాబ్ద కాలంగా పని చేస్తున్నా పట్టింపు కరువు
- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు
- డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్లాలని యోచన

భీమారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అనే నినాదంతో ముందుకు సాగుతున్న సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు క్రమబద్ధీకరణకు ఎదురు చూస్తున్నారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం 2011లో ఉద్యోగులను నియమించింది. పీజీ, బీఎడ్ టెట్ అర్హతలు కలిగిన సీఆర్‌పీలను, మండల స్థాయిలో కంప్యూటర్ ఆపరేటర్ పరి జ్ఞానం కలిగి డిగ్రీ ఆపై స్థాయిలో విద్యార్హతలు ఉన్న పీటీఐ, కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్లుగా, సీఆర్‌టీలుగా, పీజీ సీఆర్‌టీలుగా అలాగే ఏఎస్‌ఎంలను, జిల్లా స్థాయిలో ఎనలాసిస్టులను నియమించింది. వీరు 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు.

మరికొందరు 10 నుంచి 12 ఏళ్లుగా పని చేస్తున్నారు. తాము ఇన్నేళ్లుగా సేవలు చేస్తున్నా ప్రభుత్వం క్రమబద్ధీకరించడం లేదని ఆవేదన చెందుతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో 20 రోజులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి పీసీసీ హోదాలో నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంకా తమను రెగ్యులర్ చేయడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు నిరసనలు చేపట్టినా పట్టించుకోవడం లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రస్తుత వేతనాలు ఇలా..

సమగ్ర శిక్ష అభియాన్‌లో 586 మంది విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ ప్రోగ్రామర్ 1 , జీతం రూ. 32 వేలు, ఇద్దరు అటెండర్లు ఉండగా ఒక్కొక్కరికి రూ. 15 వేల వేతనం వస్తుంది. కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్లు 19 మంది పనిచేస్తుండగా నెలకు వేతనం రూ. 32,700. అలాగే పీజీ సీఆర్‌టీలు 170 మంది పనిచేస్తుండగా వేతనం రూ. 29,900, సీఆర్‌పీలు 155 మంది ఉండగా వేతనం రూ. 26 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. 18 మంది పీఈటీలు పనిచేస్తుండగా నెలకు రూ. 15,600, అకౌంటెంట్లు 18 మంది పనిచేస్తుండగా వీరికి నెలకు రూ. 18,300, ఏఎస్‌ఎంలు 18 మంది విధులు నిర్వహిస్తుండగా రూ. 14,300లను చెల్లిస్తుంది.

కేజీబీవీల్లో కుక్ ,హెల్పర్, డే వాచ్‌మెన్, నైట్ వాచ్‌మన్, ఆఫీసు సబార్డినేట్‌లు సుమారు 100 మంది పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ. 9750 అందుతుంది. జిల్లాలోని 48 కాంప్లెక్స్‌లకు 43 మంది సీఆర్‌పీలు విధులు నిర్వహి స్తుండగా వీరికి నెలకు రూ. 19,500, ఎంఆర్‌సీ స్థాయిలో 18 మంది ఎంఐఎస్‌లు, సీసీవోలు 18 మంది పని చేస్తుండగా వీరికి రూ. 19,500 ప్రభుత్వం చెల్లిస్తుం ది. ఐఆర్‌పీలు 16 మంది ఉండగా వీరికి నెలకు రూ. 19,500, మెసెంజర్‌లు 18 మంది పనిచేస్తుండగా వీరికి నెలకు రూ. 11,050 అందుతోంది. పార్ట్‌టైం ఇన్ స్ట్రక్టర్‌లు 55 మంది ఉండగా వీరికి నెలకు రూ. 11,700 ప్రభుత్వం అందిస్తుంది. అటెండర్ స్థాయి సిబ్బందికి రూ21వేల వేతనం, సీఆర్పీ, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29వేలు, ఎంఐఎస్‌లకు రూ.32వేలు, కేజీబీవీ ఎస్‌వోలకు రూ.42వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 548 మంది..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 548 మంది పని చేస్తున్నారు. వీరిలో కొందరు పాఠ శాలల్లో ఉపాధ్యాయులు సెలవు పెడితే పాఠశాలలకు నడిపించడం, బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, యూనిఫాంలు అందేలా చూడడం, ప్రభుత్వ కార్యక్రమాలను చేపడతారు. మరికొందరు మండల స్థాయిలో ఎంఐఎస్ డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాఠశాల స్థాయి నుంచి సీఆర్‌పీలు సేకరించిన డాటాను సమన్వయం చేస్తూ మండలానికి , జిల్లా విద్యా కార్యాలయానికి సంధానకర్తలుగా వ్యవహరిస్తారు. ఎప్పటి రిపోర్టులను అప్పుడు చేరవేయడంతో ప్రధాన పాత్ర పోషిస్తారు. ఇలా ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా రెగ్యులర్ కాకపోవడంతో చాలిచాలనీ వేతనాలతో కాలం వెళ్ల దీస్తున్నారు. ఈ నెల 16న ఇందిరాపార్కు వద్ద రాజకీయ పార్టీలతో కలిసి ధర్నా, గతంలో అసెంబ్లీ, సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాలు చేపట్టినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని, అలాగే వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

హామీ నిలబెట్టుకోవాలి

పుప్పాల ప్రవీణ్, సీఆర్‌పీ, చెన్నూరు



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాల్లో సైతం విధులు నిర్వహించాం. అలాగే సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో సైతం తమతో చేయిస్తున్నారు. 15 ఏళ్లగా పనిచేస్తున్నా ఇప్పటికీ కనీస వేతనం లేదు.

ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి..

సురేందర్, దండేపల్లి, సీఆర్‌పీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ



ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలి. మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలి. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 25రోజులపాటు దీక్షలు చేశాం. సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నేరవేర్చాలి. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

నస్పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అంతకు ముందుగా కలెక్టరేట్‌కు ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందించారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో నిర్వహించే బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తలకు బడ్జెట్ పెంచాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరారు. అర్హులైన ఆశా కార్యకర్తలకు ఏఎన్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని చెప్పారు. పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు దూలం శ్రీనివాస్, మహేందర్, పద్మ, అరుంధతి, పద్మ, లావణ్య, కవిత, రాణి, సుజాత, రాజ్యలక్ష్మి, సుశీల, లీలా, శారద పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ప్రజాపాలన'పై కళాజాతా

నెన్నెల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తాపూర్, ఆవడం, జెండావెంకటాపూర్ గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన, ప్రజ విజయోత్సవాలపై కళాజాతా నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల అమలుపై కళాకారులు పాటల రూపంలో వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు, రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ, 50 వేల మంది యువతకు ఉద్యోగాలపై తెలియజేశారు. కార్యక్రమాల్లో తెలంగాణ సంస్కృతిక సారథి కళా కారులు ముల్కల్ల మురళి, వెల్తారు పోషం, వడ్డపురం రవికుమార్, సత్యనా రాయణ, బీర్పూర్ శ్రీనివాస్, లింగంపల్లి రాజేష్, చేగొండ నిరోష పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీఎం హెచ్‌వో కార్యాలయంలో బుధవారం ఫైలేరియా వ్యాధి నిర్ధారణ సర్వే చేయడానికి వైద్య సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు డీఎం హెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5,400 మంది నంుచి రక్త నమూనాలను సేకరించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఇందులో భాగంగా జన్నారం, హాజీపూర్, మందమర్రి, జైపూర్, భీమిని, తాళ్లగురిజాల పరిధిలోని గ్రామాల్లో రాత్రి పరీక్షలు చేయడానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. 20 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌లు శిరీష, అనిత, సుధాకర్‌నాయక్, అనిల్ కుమార్, సిబ్బంది నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, శ్రీనివాస్, మూర్తి, వైద్యులు, సూపర్‌వైజర్‌లు, సబ్ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

భీమిని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని మల్లీడి గ్రామానికి చెందిన బల గం పెంటక్కకు మెరుగైన చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మం జూరైన రూ . 2.50 లక్షల విలువగల ఎల్‌వో సీ(లైన్ ఆఫ్ క్రెడిట్)ను బుధవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ బాధిత కుటుంబానికి అందజేశారు. అండగా నిలిచిన ఎమ్మెల్యేతో పాటు నాయకులు మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జీవో 317 బాధితులకు న్యాయం ఎప్పుడు..?



- గత ప్రభుత్వ నిర్ణయంతో తప్పని ఇబ్బందులు
- ప్రస్తుత ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని నిరాశ
- సర్కారుకు పట్టని స్థానికత కోల్పోయిన వారి గోడు
- నిబంధనలు మార్చాలనే డిమాండ్లు తెరపైకి

మంచిర్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం 2023లో జారీ చేసిన జీవో 317 బాధితులకు ఏడాది గడిచినా న్యాయం జరగడం లేదు. జీవో కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 14వేల మంది ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయారు. ఈ మేరకు ఇతర జిల్లాల్లో స్థానికేతరులుగా ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి నుంచి సొంత జిల్లాలకు పంపాలని దశలవారీగా ఆందోళనలు చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక అప్పటి 10 ఉమ్మడి జిల్లాలను 33 ప్రత్యేక జిల్లాలుగా విభజించడంతోపాటు 2 జోన్లను 7 జోన్లుగా ఏర్పాటు చేసింది. దీనికి అనుగుణంగా ఉద్యోగులను నూతన జిల్లాలకు కేటాయించడం కోసం ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (పీవో) 2018ని తీసుకువచ్చింది. పీవో 2018 ప్రకారం మూడు సంవత్సరాల్లోగా ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్రపతి ఉత్తర్వులు సైతం ఉన్నాయి. వీటిని పట్టించుకోకుండా గత సర్కార్ గడువు సమీపిస్తుండడంతో హడావుడిగా కొన్ని సంఘాలతో రహస్యంగా చర్చలు జరిపింది. ఈ మేరకు స్థానికత ప్రస్తావన లేకుండానే జీవో 317ను జారీ చేసింది. అప్పటి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల ఉద్యోగులు ఇప్పటికీ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రస్తుత ప్రభుత్వానిదీ అదేతీరు..

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటన పయనిస్తుండడంతో పరిస్థితి పునరావృతం అవుతోంది. కాంగ్రెస్ పార్టీ ఆ సమస్యను పరిష్కరించి, బాధితులందరినీ సొంత జిల్లాలకు పంపిస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది. అధికారంలోకి వచ్చాక మంత్రులతో కూడిన సబ్ కమిటీని వేసింది. ఈ నిర్ణయంతో స్థానికత కోలోయిన ఉద్యోగుల్లో మళ్లీ సొంత జిల్లాలకు వెళ్తామనే ఆశలు చిగురించాయి. కాగా 317 జీవోపై నియమించిన దామోదర రాజనర్సింహ నాయకత్వంలోని మంత్రుల సబ్ కమిటీ రిపోర్టు ఇచ్చిన తర్వాత నిజమైన బాధితులు అందరిలో నిరాశ, నిస్పృహలు ఆవరించాయి. కమిటీ ఇచ్చిన రిపోర్టులో స్పౌజ్, మ్యూచువల్‌తోపాటు మెడికల్ వారికి మాత్రమే బదిలీల్లో అవకాశం కల్పించాలని సిఫార్సు చేసింది. దీంతో కొద్ది మందికి మాత్రమే కోరుకున్న జిల్లాలకు వెళ్లే అవకాశం కలిగింది. స్థానికత కోల్పోయిన వారి ప్రస్తావన తేకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పైగా నివేదికను చాలా కాలం పాటు బహిర్గతం చేయలేదు. పలుమార్లు దీనిపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి రావడంతో బయట పెట్టారు. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా స్థానికతను కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఇక ఎప్పటికీ సొంత జిల్లాలకు వెళ్లలేమనే భావన బలంగా నాటుకుంది. ఉదాహరణకు ఆసిఫాబాద్ జిల్లా వంటి చోట్ల నూతన ఉద్యోగాలు పొందే వారికి ఖాళీలు లేకుండాపోయాయి.

మిగతా 7వ పేజీలో..

నేల తల్లిని కాపాడుకుందాం..

- భూసార పరీక్షలతో భూమికి రక్ష
- రైతులకు పంట దిగుబడులు
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం
- నేడు ప్రపంచ నేల దినోత్సవం

7



భూసార పరీక్ష కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన మట్టి నమూనాలు

క్రమబద్ధీకరణ ఎప్పుడు..?

- దశాబ్ద కాలంగా పని చేస్తున్నా పట్టింపు కరువు
- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు
- డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్లాలని యోచన

7



నవంబరు 16న ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు (ఫైల్)

నాయకుల ముందస్తు అరెస్టు



జైపూర్ పోలీసులు అదుపులోకి సుకున్న బీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నాయకులు

జైపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియా జ్ అహ్మద్, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతి, రమేష్, తుంగపిండి శేఖర్ ఉన్నారు.

కోటపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ రాంపూర్ గ్రామంలోని ఆయన సొంత ఇంటి నుంచి పోలీసులు అరెస్టు చేసి కోటపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సోసల్ మీడియా సభ్యులు ఆసంపల్లి సంపత్, కొట్టె వెంకటేష్, అనిల్, బాపునాయక్ , నూతన్, కుమ్మరి సంపత్, దుర్గం రాజేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

భీమారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు భుక్య రాజ్‌కుమార్ నాయక్, గుడిమల్ల వెంకటేశ్వర్లు, నరేష్, మహేష్ తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి భీమారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తాండూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ పోలీసులు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి దాగం రాజారాంను ముందస్తు అరెస్టు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని రాజారాం పేర్కొన్నారు.

కన్నెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి కన్నెపల్లి పోలీస్‌స్టేసన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో మాజీ జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు జిల్లెల్ల మహేష్‌గౌడ్, నాయకులు దేవాజీ, రోషన్ ఆలీ, శ్రీనివాస్, బాలాజీ, , మహేష్ ఉన్నారు.

యేడాదిలో ఎంతో అభివృద్ధి

- సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల అభిమానంతో గెలిచిన యేడాది కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో బుధవారం నియోజకవర్గంలోని 211 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 193 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సంబంధిత అధికారులు, నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్లుగా నడిపిస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ధాన్యంలో తాలు, తప్ప పేరుతో క్వింటాల్‌కు 10 కేజీల కోత విధిస్తూ రైతులను మోసం చేశారని విమర్శించారు. తాను గెలిచిన తెల్లారే సంబంధిత అధికారులతో మాట్లాడి కోత లేకుండా కొనుగోళ్లు చేయించానన్నారు. నియోజకవర్గంలో 96 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుడా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తాగునీటి సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకున్నామని చెప్పారు. 20 ఏళ్లల్లో ఎన్నడు లేని విధంగా 42 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వరకు సాగునీరందించా మన్నారు. గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి నీరందించేందుకు పైపులను పునరుద్ధరిం చామన్నారు. నియోజకవ్గరంలోని సమస్యలన్నీ గుర్తించి పరిష్కరిస్తామని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో మాత్రమే 90వేల మందికి పైగా అర్హులైన వారందరికి గృహజ్యోతి జీరో బిల్ కింద ఉచిత విద్యుత్ సేవలందుతున్నాయన్నారు. ఏడాదిలో 1,017 మందికి సీఎం రిలీఫ్ చెక్కులను అందించామని వివరించారు. కాగా 1,210 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులనందించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ చైర్మన్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ

గర్మిళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి కలుగజేసుకుని హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే అడ్డుకోవాలని చెప్పారు. అరెస్టు చేసిన ఇస్కాన్ స్వామిజి చిన్మయ కృష్ణ దాసును విడుదల చేయాలని కోరారు. బంగ్లాదేశ్‌కు ఇచ్చిన నోబెల్ బహుమతిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, సమ్మయ్య, తిరుపతియాదవ్, తుల మధుసూదన్, మున్నారాజా సిసోడియా, అశోక్‌వర్ధన్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

గర్మిళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకట స్వామిని మంచిర్యాలలోని ఆయన నివాసంలో బుధవారం మాల , మాల ఉద్యోగుల జేఏసీ కమిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాలల ఐక్యతను ఢిల్లీకి ఎమ్మెల్యే వినిపించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ తొగరు సుధాకర్, కో కన్వీనర్లు రవికుమార్, సుధీర్, లక్ష్మణ్ రాజేష్, మల్లన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలతో నిండిపోయిన గూడెం రంగంపల్లి క్రీడా మైదానం

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

దండేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతను క్రీడల్లో తీర్చిదిద్దడానికి గత ప్రభుత్వం పల్లెల్లో క్రాడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. మైదానాల ఏర్పాటు కోసం స్థలాలు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో గ్రామాలకు దూరంగా పాఠశాలలు, కళాశాలల మైదానంలో బోర్డులను ఏర్పాటు చేశారు. తరువాత వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అవి బోర్డులకే పరిమితమయ్యాయి. యువతకు ఉపయోగపడని దుస్థితి నెలకొంది. దండేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రంగంపల్లి గ్రామ శివారులోని ఓ గుట్టపై ఈ క్రీడా ప్రాంగణంను అధికారులు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాన్ని వినియోగించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మందమర్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మందమర్రి పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి అన్నారు. మందమర్రి మున్సిపాలిటీలోని ఆయా వార్డులను బుధవారం సందర్శించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. స్థానిక 15వ వార్డు భాగ్యనగర్ కాలనీ నుంచి శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ వరకు చేపడుతున్న రోడుడ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి 4 కోట్ల నిధులను మంజూరు చేయిం చామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు నాణ్యత లోపాలను తనిఖీ చేయాలని చెప్పారు. అనంతరం మార్కెట్ ఏరియాలో అంబేద్కర్ భవన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ భవన నిర్మానానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. పట్టణంలోని ప్రాణహిత కాలనీ డబుల్ బెడ్‌రూం సమీపంలో గల స్థలాన్ని షాదీఖానా కోసం పరిశీలించారు. స్థలం ఎంత ఉందో వివరాలు తెలపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్, దుర్గం నరేష్, గుడ్ల రమేష్, బండి సదానందం, జావిద్‌ఖాన్, నెర్వెట్ల శ్రీనివాస్, ముత్తయ్య, పుల్లూరి లక్ష్మణ్, గడ్డం రజిని, తదితరులు పాల్గొన్నారు.

మాలలను రెచ్చగొట్టడం సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య

మందమర్రి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాలలను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రెచ్చగొట్టడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు సారంగం మాదిగ అన్నారు.. బుధవారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేవలం మంత్రి పదవి కోసమే మాలలను కూడగట్టుకుంటున్నారని తెలిపారు. మందకృష్ణ ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం సాగుతుందన్నారు. మూడు దశాబ్దాల పోరాటాన్ని సుప్రీంకోర్టు అంగీకారం జారీ చేస్తే ఎమ్మెల్యేగా వ్యతిరేకించడం ఏమిటన్నారు. ఒక సమాజిక వర్గం ఓటు వేస్తే ఆయన గెలవలేదని గుర్తుంచుకోవాలన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మాదిగలు అధిక శాతం ఉన్నప్పటకి ఎంపీగా తన తనయుడు, బెల్లంపల్లిలో తన సోదరుడు ఎమ్మెల్యేగా ఒక సామాజిక వర్గం వారు లబ్ధి పొందుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో ఆసంపెల్లి శివ, మిట్టపల్లి బాపు, అఖిల్, నందిపాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి పదవి కోసమే చిచ్చు'

భీమారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రి పదవిని దక్కించుకునేందుకు ఎస్సీ వర్గీకరణ అంశంలో చిచ్చుపెడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తండ్రి మంత్రిగా, కేంద్ర మంత్రిగా పనిచేసినప్పుడు , ఆయన అన్న కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు కూడా మాలల గురించి పట్టించుకోలేదన్నారు. కేవలం మాల సామాజిక వర్గాన్ని మోసం చేసేందుకు కేత్రలు పన్నుతున్నారని అన్నారు. మాలలు మోసపోవద్దని కోరారు. సమావేశంలో నాయకులు రాము, సమ్మయ్య, మణిదీపక్, తిరుపతి, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

కోటపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండంపేట గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా చేపడుతున్న వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఇందులో చెన్నూరు పట్టణానికి చెందిన ప్రశాంత్ టీం విజయం సాధించగా రెండో స్థానంలో కొండంపేట జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ. 20 వేల నగదు, మెడల్స్, రన్నర్‌గా నిలిచిన కొండంపేట జట్టుకు రూ.10 వేల నగదును అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్ అన్నారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా నిరుద్యోగులు రుణాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే ఎస్సీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలని కోరారు. యూనిట్లు మంజూరై సబ్సిడీ రుణాలు విడుదల కాకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ రుణాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

వసతి గృహం ఎదుట ధర్నా

మందమర్రిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో జోన్‌ల గల బాలుర ప్రభుత్వ వసతి గృహం ఎదుట బీఆర్ఎస్వీ నాయకులు ధర్నా నిర్వహించారు. బుధవారం వసతి గృహాన్ని సందర్శించడానికి వచ్చిన నాయకులను వార్డెన్ అడ్డుకోవడంతో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, బట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్‌లు మాట్లాడుతూ వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని చెప్పారు. సమస్యలను పరిశీలించేందుకు వస్తే ఎందుకు అనుమతించడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల సంక్షేమం కరువైందని తెలిపారు. కార్యక్రమంలో ముస్తాఫా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పనులను గుర్తించాలి

వేమనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీలో భాగంగా గ్రామాల్లో కొత్త పనులను గుర్తించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాయలంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పల్లె ప్రగతి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం

కాసిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ప్రభావిత గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామని ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ అన్నారు. బుధవారం గట్రావుపల్లి పంచాయతీ పరిధి లోని తుదుంగూడెం, గోందుగూడెం, గట్రావుపల్లి, ఇప్పలగూడెం, సాలెగూడెంలలో ఆరు బోర్‌వెల్స్‌కు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, మాజీ సర్పంచు పెంద్రం రాజు, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'భూమి కబ్జా కాకుండా చూడాలి'

వేమనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూమి కబ్జా కాకుండా చూడాలని బుధవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వేమనపల్లి మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు సంబంధించి సర్వే నంబరు 80లోని భూమిలో 3 ఎకరాల భూమిని గిరిజనేతరుడు అయిన దస్నాపూర్ మాజీ సర్పంచు కబ్జా చేసి సాగు చేస్తున్నాడని , వెంటనే భూమిని స్వాధీనం చేసుకుని పాఠశాలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు బండి రమేష్, కోశాధికారి పెద్దల వెంకటేష్, నాయకులు మాంతయ్య, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'భూకబ్జాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా మంత్రి పదవీ కోసం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ హైదరాబాద్, ఢిల్లీకే పరిమితం అయ్యారన్నారు. కాంగ్రెస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, బీజేపీ ఆధ్వర్యంలో తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, నాయకులు గోవర్ధన్, కేశవరెడ్డి, రాచర్ల సంతోష్, రాజులాల్ యాదవ్ పాల్గొన్నారు.

కవ్వాల టైగర్ జోన్‌లో పర్యటన

జన్నారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లు బుధవారం యూట్యూబ్ ఇన్ఫ్యూలెన్సర్ అంజిమామ తన టీం సభ్యులతో పర్యటించారు. టూరిజంకు చెందిన సఫారి వాహనంలో టైగర్ జోన్‌లోని గోండుగూడ అటవీ ప్రాంతంలో పర్యటిం. టైగర్ జోన్‌లోని వన్య ప్రాణులు,అడవుల సంరక్షణపై ఫారెస్టు అధికారులు ఆయనకు వివరించారు.

అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవం

శ్రీరాంపూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌కు చెందిన అయ్యప్ప స్వాములు గోదావరిలో బుధవారం అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం అంజనేయస్వామి ఆలయం వరకు నిర్వహించిన శోభాయాత్రకు మహిళలు, అయ్యప్ప స్వాములు హాజరయ్యారు.